౫౧

వస్తాదు వీరన్న

వీరన్న బలశాలి. మంచి వస్తాదు. అలాంటి వాడిలా అవుతాడని ఎవరూ కలలోకూడా అనుకోలేదు.

ఆరోజు ఎప్పటిలాగే తెల్లవారుజామున కోడికూసే వేళ లేచి చెరువుకుపోయి, మొహం కడుక్కొని తాలింఖానాకు పోయాడు. కసరత్తు చేయడానికీ, కుస్తీలుపట్టడం అభ్యాసం చేయడానికీ ఓ పదిమంది చేరుతారక్కడ ప్రతిరోజూ. వారందరికీ, చిన్నవాడైనప్పటికీ వృద్ధిలోనికి వచ్చినవాడు కాబట్టి వీరయ్య అంటే గౌరవం. ఆసీమలోకల్లా ఊరూపేరూ వున్నవాడుకదా మరి. ఆ చుట్టుపట్ల వున్న నాలుగైదు పట్టణాలకూ పోయి ఎవడైనాసరే కుస్తీకిరమ్మని, నూటపదహార్లు పందెం వేసి, బస్తీమే సవాల్ చేశాడు వీరయ్య. ఆ యా వూళ్ళలోని వస్తాదులందరినీ చిత్తుచేసి, మెడలో పూలదండలతో భీమసేనుడిలా తిరిగివచ్చాడు. చాలమంది పంజాబీ ఫయిల్వానులను కూడా చిత్తుచేసి, తన పేరు వారికి కలకాలం జ్ఞాపకముండేటట్లు చేశాడు.

వీరన్న ఒడ్డూపొడవూ వున్న మనిషి. కసరత్తువల్ల కండలు తిరిగిన శరీరం. తివాసీగుండు. చిన్నప్పుడు జబ్బుచేస్తే, కుడికంటికీ, చెవికీ మధ్య నిలువునా, తరిగిన దొండకాయ ముక్కంత వాతపెట్టిన మచ్చ. మెడలో ఆంజనేయుడి బిళ్ళ, జబ్బకు బంగారు తావేజు ఎండలో నిగనిగ మెరిసేవి. లంగోటీ బిగించికట్టి, ఒంటికి రేగడిమన్ను రాసుకుని, గురువు పాదాలకు దండంపెట్టి, నోట్లో పళ్ళమధ్య నిమ్మకాయ కొరుకుతూ, తొడ

చరిచి కుస్తీకి తలబడితే ఎదుటివాడి గుండెలు భయంతో గడగడ వణకేవి. చూసేవారిలో ఉద్రేకం ఉప్పొంగేది.

అలాంటి వీరయ్య ఇలా అవుతాడని ఎవరూ కలలో కూడా అనుకోలేదు.

చెరువులో స్నానంచేసి, మల్లుపంచికట్టి, మల్లుచొక్కా వేసుకుని పావంచాల మీదికివచ్చి బీడీ వెలిగించాడు బట్టలుతుక్కోడానికీ, స్నానాలు చెయ్యడానికీ చెరువుగట్టుకు వచ్చిన ఆడంగులు వీరన్నను చూసి, ముసిముసినవ్వులు నవ్వుకున్నారు. "ఏటి ఈరన్నా ఎక్కడికేటి యీ ముస్తాబు, ఏటి ఇసేసం" అన్నారు పల్లెపడుచులు.

"నెల్లిమరలలో అమ్మోరిసంబరం చూడాం రమ్మంటున్నాడు ఎంకయ్యబావ. కరుసు ఆడిదేలే" అన్నాడు వీరన్న బీడీపొగ వదుల్తూ.

"నేకపోతే నువ్వెడతావేటి, పిల్లికి బిచ్చంపెట్టవు నువ్వా" అంది గొల్లపిల్ల నగిసి.

ఓసి. ఊరుకోయే పిన్నమ్మా నాసంగతి నీకేటెరిక" అని పక్కనున్న బిందెను కాలుతో తోశాడు. బిందె చప్పుడు చేసుకుంటూ రెండు పావంచాలు దొర్లింది. వీరన్న "హీ, హీ, హీ" అని నవ్వేడు

"ఏటిరోరయ్యా ఆ పోగాలం, బాదంపప్పుతిని కసరత్తు సేత్తే ఒళ్ళు కొవ్వెక్కినట్టుంది." అంది నగిసి.

"ఆడోళ్ళు నీళ్ళోసుకుంటారు, నువ్వేటికక్కడ, ఫో అవతలికి" అంది ఇంకోపిల్ల.

వీరన్న నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు. వెంకయ్యతో కలిసి నెల్లిమర్ల సంబరానికి వెళ్ళేడు. వెంకయ్య, వీరన్న స్నేహితుడు. వెంకయ్యకూ, వీరన్నకూ నేస్తం ఎలా కుదిరిందో అందరికీ ఆశ్చర్యమే! ఏవిధంగానూ యిద్దరికీ పోలిక లేదు. వీరన్న వస్తాదు. వెంకన్న సన్నగా పొడుగ్గా ములక్కాడలా వుంటాడు. వీరన్న మొద్దువాడిలా కనిపిస్తాడు. వెంకయ్య తెలివైనవాడిలా మాట్లాడుతాడు. అసలు రాంమందిరంలో భజనకు వెళ్ళినప్పుడు కలిసింది వీరిద్దరికి నేస్తం. వీరన్న పాడితే, వెంకయ్య డోలకు వాయించేవాడు.

సంబరం చూసుకుని యింటికి తిరిగి బయలుదేరేసరికి చీకటిపడింది. ఊరు పొలిమేరలకొచ్చేసరికి రాత్రి పదిగంటలవుతుంది. వెంకయ్య అలసిపోయాడు. ఊరుబయట పాడుపడిన దేవాలయం మెట్లమీద చతికిలబడ్డాడు.

"ఏం వెంకయ్యా, రెండుకోసులదూరం నడిసేసరికే అలిసిపోనావేట్రా. ఇలాగైతే ఎలా బతుకుతావేశ్" అన్నాడు వీరన్న.

"ఒంట్లో బలంలేదు ఏటి చెయ్యమంటావు. అయినా బతకడానికి బలమే ఉండాలేటి, ఎర్రిగాని" అంటూ వెంకయ్య మెట్లమీద నడుంవాల్చేడు. ఇద్దరూ బీడీలు వెలిగించారు.

ఆ కారుచీకట్లో వాళ్ళ బీడీనిప్పులు తప్ప మరేం కనబడడంలేదు. అమావాస్య రాత్రిల్లు, వెనుకనుపాడుపడిన కోవెలచుట్టూ అడవి బలిసింది. ఆ నిశ్శబ్దంలో కీచురాళ్ళ శబ్దంమాత్రం వినిపిస్తూంది. దూరాన వూరిలో ఒకటిరెండు దీపాలుమాత్రం మినుకు మినుకు మంటున్నాయి.

వీరన్న ఆలోచిస్తున్నాడు. ఒక్క బలం ఉన్నంతమాత్రాన అంతా సిద్ధించినట్టేనా? మనిషికి బలం ఒక్కటే కాదు కావలసింది. మావటివాడికి ఏం బలముందని ఏనుగను లొంగదీసుకున్నాడు. పీర్ల పండుగనాడు సాయిబు అగ్గిలోంచి నడుస్తాడు వాడి కేం బలముందని?

అవును వెంకయ్య చెప్పింది నిజమే. వెంకయ్య తెలివైన వాడు. "ఎంకయ్యా" అని పిలిచేడు. వెంకయ్య నిద్రపోతు న్నాడు. అలసివున్నాడేమో కునుకు పట్టింది.

"ఏం ఈరన్నా, పోదామా" అన్నాడు వెంకయ్య కొంచెం ఒత్తిగిలి.

"దప్పికగా వుంది. ఇక్కడెక్కడేనా నీరుందిరా", అన్నాడు వీరన్న.

"వెనుక గుడిప్రక్కనే నుయ్యివుందిరా. అక్కడే బాల్చి కూడా వుంటుంది సూడు."

వీరన్న నూతిదగ్గర కెళ్ళేడు. ఎదురుగుండా దూరాన మైదానం కనిపిస్తూంది. నల్లటి కంబళికి కన్నాలుపడినట్లు చుక్కలు మినుకుమినుకు మంటున్నాయి. గాలి చలనం లేదు. చీకటు జిమ్ముకుంటూ చెట్లమీద ముసురుతున్నాయి. దూరాన ఈతచెట్లు తల విరబోసుకున్న దెయ్యాల్లాగున్నాయి. కీచురాళ్ళ శబ్దం శరీరమంతటికీ తాకుతున్నట్టనిపించింది. దూరాన మైదానంలో ఏదో మంట, మంటవెలుగులో తెల్లచీర కట్టుకున్న ఒక స్త్రీ నడిచివెళ్ళినట్లు అనిపించింది: వీరన్న జాగ్రత్తగా తేరిపార జూశాడు. అబ్బే, అది స్త్రీ కాదు. ఏదో ఆవు అయివుంటుంది, అనుకున్నాడు. తన కాళ్ళలోంచి ఏదో పరుగెట్టినట్టయింది.

తృళ్ళిపడ్డాడు. ఏదో కిచకిచమని అరిచింది. "ఛాయ్! ఎవరక్కడ!" అని కేక వేశాడు. అగ్గిపుల్ల తీసి వెలిగించి చూశాడు. నూతి గట్టునుంచి ఉడత అటు పరుగెట్టింది. వీరన్నకు దాహంపోయింది. తిరిగి వచ్చేశాడు.

"ఎవరురా అది ఈరన్నా, ఏటి కేకేస్తున్నావ్" అన్నాడు వెంకయ్య లేచి కూర్చొని.

"ఎవరూ నేదేశ్, ఉడతపిల్ల కాళ్లలో పడింది,"

"ఈరన్నా, ఎంత పిరికోడివిరా నువ్వు."

"ఛ! నాకు భయమేటిరా!"

ఇద్దరూ లేచి, బీడీలు వెలిగించి ఊరువేపుకు నడక ప్రారంభించారు. ఆ నిశ్శబ్దం వీరన్నకు నచ్చలేదు.

"ఎంకయ్యా, మంచికునుకు తీసీశావ్."

"నేదురా, కొద్దిగా కళ్లుమూశా. ఇప్పుడెంత రేతిరి అవుతుందో గాని మహాచీకటిగా వుంది. దారి సమంగా ఆనకుండా వుందేశ్."

దూరాన్న మైదానంలో ఇందాకటి మంట యింకా మండుతూనేవుంది. "ఏటిరా ఆ మంట, ఎంకయ్యా" అన్నాడు వీరయ్య. "ఏది, అదా? శ్మశానం గదరా అది. ఎవర్నో తగలెడుతున్నారు గాబోలు."

"దీని తస్సాదియ్యా, ఎంతసేపు మండుతూందిరా" వీరన్నకు భయంవేసిందని వెంకయ్య గ్రహించాడు. తాను బలశాలినని గర్వంతో విర్రవీగే ఘటుల్మాను ఇంత పిరికివాడని తానింతకాలం ఊహించలేదు. చిరుతపులిలా మనుషులమీదికి ఉరికే వీరన్న అకారణంగా చెట్టునో, పుట్టనూ చూసి జడుస్తు

న్నాడు. వీరన్నను ఇంకా భయపెట్టాలనిపించింది వెంకయ్యకు.

"ఈరన్నా రాత్రేళ చీకట్లో నువ్విటేపు రానేదేటి? ఇక్కడదాకే భయంలేదుగాని ఆ తోట దాటి ఎల్లడం మంచిది కాదు, శ్మశానంగదరా. దెయ్యాలు తెగ తిరుగుతాయి మనిషి ఒంటరిగా దొరికినాడంటే పీక్కుతినేస్తాయి. కోమటోళ్ల పిల్ల చచ్చిపోయిందిగదా, అది దెయ్యమయింది ఆ దారంట ఎవ రైనా ఎల్లితే ఎనకనుంచి పంచకొంగు పట్టుకు లాగుతాది" అని వెంకయ్య, వీరన్న మొహం చూశాడు.

వీరన్న మొహంలో భయం కనిపించింది. ఆ మానవా తీతమయిన శక్తి స్వరూపం ఎలా వుంటుందో ఊహించుకోటానికి ప్రయత్నిస్తున్నాడు వీరన్న

"ఎలాగుంటుందిరా దెయ్యం?" అని అడిగేడు.

"నువ్వు సూడలేదేటి ఎప్పుడూ? అది నల్లగా మొహం, పెద్దపళ్ళు; మహా వికారంగా వుంటుంది. తెల్లచీర కట్టుకుం టాది. రవిక ఏసుకోదు. మనం సూస్తుండగానే శరీరం ఎదిగి పోతాదారే. కాళ్ళు తాటిచెట్లులాగ. చేతులు మర్రిఊడల్లాగ ఎదిగిపోతాయి. మనిషి వెనకాతలే చేతులూపుకు నడుస్తాది. భయంకరంగా నవ్వుతాది, ఏడుస్తాది." వెంకయ్యకు మరి యింతకంటె భయంకరంగా వర్ణించడం చాతనయింది కాదు.

"అయితే అది మనుషుల్నేటీ సెయ్యదా?" అని వీరన్న అడిగేడు. వెంకయ్యకు నవ్వొచ్చింది. అది విజయగర్వంతో కూసిన నవ్వు. ఆ ప్రశ్నతోనే వీరన్న మనసులో వున్నం భయాన్ని అర్థం చేసుకున్నాడు వెంకయ్య. నవ్వు అణచుకుని, "మనం దండంపెట్టి ఆంజనేయదండకం సదువుకుంటే ఏం

చెయ్యాదు. మాయమైపోతాది. ఏమాత్రమైనా జడిసినామా అంటే పీక పట్టుకుని నులుమేసి, తినేస్తాది. దెయ్యమంటే మరేటి?" అన్నాడు అదొక సామాన్యమైన విషయంలాగ. వీరన్నను బాగా భయపెట్టగలిగినందుకు తనలో తాను సంతోషించాడు.

చీకట్లో చుక్కలు మొసగుతున్నాయి కాబట్టి ఊళ్ళోకి వచ్చినట్లు జ్ఞాపకమొచ్చింది వీరన్నకు. ఊళ్ళో అంతా నిద్ర పోతున్నారు. వీరన్న వెంకయ్య ఎవరిమానాన వారు పోయి పడుకున్నారు.

తెల్లవారేక ఊళ్ళో నలుగురూ యీ మాటే అనుకుంటున్నారు. వీరన్నకు నిన్న రాత్రి పాడుపడ్డ కోవెలదగ్గర దెయ్యం కనిపించిందనీ నాగు బట్టిపట్టుకులాగిందనీ, శ్మశానం లోంచి దెయ్యాలు రాళ్ళు రువ్వేయనీ. దానితో వీరన్న జడుసుకున్నాడనీ, యిలా చిలువలు పలవలు కల్పించి చిత్రవిచిత్రంగా చెప్పడం మొదలెట్టేరు. కనబడిన ప్రతీవాడూ "ఏం జరిగింది ఈరన్నా" అని అడగడమే. బాగా పరిచయమున్న మిత్రులు "ఓస్ ఇంతేనట్రా వీరన్నా నీ ధైర్యం! ఒంట్లో ఊపిరి లేకపోయినా నీకంటే ఎంకయ్యో నయం" అని వేళాకోళం చేశారు. చెరువుగట్టున పల్లెపడుచులు వీరన్నను చూసి వేళాకోళం మొదలుపెట్టేరు. "ఏటిరోరన్నా, శరీరం పెంచగానే సరా చెప్పు" అని ఒక అమ్మి అంటే "ఆడోళ్ళకాడ పెద్దకబుర్లు చెప్పడమేటి, గుండెధైర్యం ముండాలని ఇంకో అమ్మి హాస్యమాడింది. వీరన్న స్వతహాగా గర్విష్టి ఇది తనకెంతో అవమానకరంగా వుంది. వెంకయ్య తెల్లవారే సరికి

ఊరంతా యీ పుకారు లేవదీసివుంటాడు. ఆడంగుల దృష్టిలో కూడా తను అవహాస్యంపాలయాడు. ఎంత తలవంపు! తన ప్రతిష్ఠకు ఎంత దెబ్బ! దీనిని వెంటనే ఎదుర్కొని తీరాలి, అనుకుని. వీరన్న ఛాతీ విరుచుకుని వీధిలో నడక ప్రారంభించాడు.

ఊరు నడి బొడ్డులోవున్న వేపచెట్టు క్రిందికి వచ్చాడు. అక్కడున్న బండరాయిమీద వెంకయ్యా, మరి కొందరు మిత్రులు వేపపుల్లలతో పళ్ళు తోముకుంటూ, లోకాభిరామాయణం చర్చిస్తున్నారు. వారంతా వీరన్నను పలకరించారు.

"రారా ఈరయ్యా, కూరుసో."

"నేనేదో పిరికివాడిననీ, రాతిరి జడిసిపోనాననీ య్యీ ఎంకయ్య ఇయాల ఊరంతా సాటినాడు. దాని సంగతేదో ఇప్పుడే తేలిపోవాల" అన్నాడు వీరన్న.

"నేనేం సాటలేదు. ఒకరిద్దరు మనోళ్ళతో మాటవోరసికి అన్నాను." అన్నాడు వెంకయ్య.

"అదే అబద్ధం చెప్పినావు. నేను జడిసినానా? వహ్! మహా ధైర్యవంతుడిలాగ వొచ్చి చెప్పేసినాడంట."

"అబద్ధం కాదురా నాయనా, నిజంగా నీకు భయమేసిందా లేదా సెప్పు! ఆమాటకొస్తే నీకంటె నేను ధైర్యవంతుడినే" అన్నాడు వెంకయ్య.

"ఓరి, సాలు ఊరుకోరా — బయలుదేరినారు మొనగాళ్ళు. ఎల్లరా ఈరన్నా ఆడితో నేటి" — అక్కడున్న వారంతా దీనిని సద్దుబాటు చేయడానికి చూశారు. ఇదిగాని మితిమీరితే తీవ్రంగా పరిణమిస్తుందని వారి భయం. ఎందుచేతనంటే వీరన్న మోటవాడు. వెంకయ్య మొండివాడు.

వీరన్నకు ఒళ్ళు మండింది. "గొప్ప ధైర్యవంతుడి వంటున్నావే-ఏది చూపించరా నీ ధైర్యం, అదేమాత్రమో నేను సూత్తాను," అన్నాడు.

"ఒరే, ఊరుకొంటున్న కోవిలతోటలో సక్కని మని సుండగా జనిసినోడివి నీకు నాతో పంతమేటిరా? నీ ఎర్రిగాని. జబ్బబలం వేరు, గుండె బలం వేరురా నాయనా!"

"అదే సూత్తాను. ఇదిగో ఒందరూపాయలు పందె మేద్దాం"

"సరే అయితే, మాట తప్పకూడదు సుమా" అన్నాడు వెంకయ్య. చీకట్లో అర్ధరాత్రప్పుడు శ్మశానంలో కెళ్ళి అక్కడ కూర్చొని ఒక మేకు భూమిలోకి కొట్టి రావాలి, అదీ పందెం. ఎవడు అలా వెళ్ళి రాలేకపోతే వాడు ఓడిపోయినట్లు. ఆవేళ రాత్రే పందెం. ఈ వార్త ఊరంతా తెలిసిపోయి గొప్ప ఆసక్తి రేకెత్తించింది. అంతా పందెం గురించే మాట్లాడుతూ వుండేవారు. వీరన్న గెలుస్తాడని ఒకడంటే, వెంకయ్య గెలవ గలడని ఒకడు. ఎవడికి తోచినటు వాడు ఊహాగానం చేశాడు.

ఆ రోజంతా వీరన్న దీనినిగురించి ఆలోచించాడు. తను ఇంతకు మునుపు అనేకమందితో పెద్ద పెద్ద కుస్తీలు పట్టేడు. ఎప్పుడూ యింత ఆలోచించలేదు. దీనినిగూర్చి యింత ఆలోచించడానికేముందో తనకర్థం కాలేదు. పగటివేళ అనేక సార్లు తనా శ్మశానంగుండా నడిచి వెళ్ళేడు. అక్కడ భయపడ డానికి ఏమీ లేదు. ఆమాత్రానికి రాత్రివేళమాత్రం భయ మేమిటి? ముక్కు చివర ఊపిరితో బతికే వెంకయ్య వెళ్ళగా

లేనిది తనే నేమిటి వెళ్ళలేదు. అదేదో చూద్దాం అనుకున్నాడు వీరన్న. అయితే వెంకయ్య యీ విషయం గురించి ఆలోచించ నేలేదు. రాత్రి నలుగురూ వచ్చి పందేనికి రమ్మని పిలిచేవరకూ ఆ సంగతే జ్ఞాపకం లేదు.

అంతా కలిసి పాడుపడిన కోవెల తోటలోకి వెళ్ళి కూర్చున్నారు. అక్కడనుండి కొంచెం దూరానవున్న శ్మశానంలోకి ముందు వెంకయ్యా, తరువాత వీరన్న వెళ్ళిరావడానికి ఏర్పాటయింది.

అమావాస్య రాత్రి. అంతటా చిక్కటి చీకటి దట్టంగా కమ్ముకుని వుంది. ఆకాశంలో మేఘాలు కమ్ముకుని వుండడం వల్ల నక్షత్రాలు కూడా లేవు. గాలి కదలడం లేదు. వీరన్న మాటాడకుండా నిశ్శబ్దంగా కూర్చున్నాడు.

వెంకయ్య మేకు, సుత్తి పట్టుకుని మైదానంలోకి నడిచి వెళ్ళేడు. ఒకరిద్దరు కొంత దూరం వరకూ వాడివెంట వెళ్ళి ఆగిపోయారు. ఓ పదినిముషాలయ్యేక, నిర్ణీత స్థలంలో నేలకు మేకు కొట్టి వెంకయ్య తిరిగి వచ్చాడు. తరవాత వీరన్న బయలుదేరేడు.

వీరన్న ఆవేళ మల్లుపంచ కట్టేడు. మల్లు చొక్కా వేసుకున్నాడు. ఒక చేతిలో మేకూ, ఒక చేతిలో సుత్తీ పట్టుకు బయలుదేరేడు.

మైదానంలో నల్లటి చీకటితప్ప మరేం కనపడడం లేదు. ఆ మైదానం ఊపిరితీయని శవంలా నిశ్శబ్దంగా పడుకుని వున్నట్టుంది. అక్కడక్కడ ఈత తుప్పలు శవం ప్రక్క తల విరబోసుకుని కూర్చున్న ఆడవాళ్ళలా, ఏడుస్తున్నట్టున్నాయి.

గాలి చలనంలేక ఒక ఆకైనా కదలక, జీవితం కదలని ఒక పెద్ద కొండలా స్తబ్ధంగా పడివున్నట్టుంది అతనికి తన శరీరం చాలా బరువుగా వున్నట్టనిపించింది ఆ నిశ్శబ్దంలో దూరాన దుమ్ముల గొండి సకిలించింది. అది చేసిన శబ్దం చీకట్లను చీల్చుకుని తన శరీరమంతా తాకినట్లయింది. "పాడు జంతువు; మహా భయపెడుతోంది" అనుకున్నాడు వీరన్న.

దూరాన తాటిచెట్లమధ్య నిప్పు రాలుతున్నట్లు కనిపించింది. జేబులోంచి కాగితపు పొట్లంతీసి, అందులోని ఆంజనేయస్వామి సింధూరం బొట్టు పెట్టుకున్నాడు. తన చేతి వేళ్లు వణుకుతున్నట్టు గ్రహించాడు వీరన్న.

అనుకున్నచోటికి వెళ్ళి, మేకు నేలను పెట్టి సుత్తితో కొట్టేడు. తన గుండెలు దడదడ కొట్టుకుంటున్నట్టు తెలుసుకున్నాడు. మొత్తంమీద అనుకున్న పని అయిపోయింది. వీరన్న పెద్ద నిట్టూర్పు తీసి, చటుక్కున వెనక్కు తిరిగి ఒక అడుగు వేశాడు. వెనకనుంచి ఎవరో తన పంచెకొంగు పట్టుకు లాగేరు. ఎవరో నవ్వినట్లయింది. మరొకడుగు ముందుకు వేయబోయాడు వీరన్న వెనుక పంచ చిరిగిన శబ్దమయింది. అంతే, వీరన్న నిలువునా పడిపోయాడు.

చాలాసేపు చూసి ఎప్పటికీ రాకపోతే కాగడా వెలిగించుకుని చూడడానికి వెళ్లేరు అంతా. ఘుల్లామను వీరన్న చచ్చిపోయాడు. అతని పంచ కొంగుమీద మేకు కొట్టివుంది. కేసు పోలీసుల పరమైంది.

★